క్లుప్తంగా

12న విద్యుత్ సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఏడీ అనంతయ్య 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోమరమ్మతు కారణంగా శనివారం పట్టణం మొత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని సహకరించాలని కోరారు.

రూ.20వేల ఆర్థికసాయం

భూత్పూర్: మద్దిగట్లకి చెందిన విద్యార్థిని పుష్ప మహారాణికి గురువారం రూ.20వేల ఆర్థికసాయాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. గతంలో ఆమెకు చదువుకోసం సాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు సాయం అందించారు.

నియామకపత్రం అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు షేక్ మూసా బావజీర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా సోహైల్ నియమాకపత్రం జారీ చేశారు. ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ గురువారం జిల్లా కేంద్రంలో అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గండేడ్: వెన్నచేడ్‌లోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొండల్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సబ్జెక్టుల్లో బోధించడానికి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 14న ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో పాఠశాలలో హాజరుకావాలని సూచించారు. డెమో క్లాస్ ఇచ్చేందుకు ప్రిపేర్ అయి రావాలని తెలిపారు.

డ్రోన్ కెమెరాతో గాలింపు

మహమ్మదాబాద్: జూలపల్లి అటవీప్రాంతంలో జరిగిన మర్డర్ కేసు విషయంపై విచారణలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టింది. జూలపల్లి పెద్దతండాకు చెందిన లక్ష్మీబాయిని స్వయానా(అక్కకొడుకు) కుమారుడు హత్య చేయడంతో బుధ, గురువారాల్లో ప్రత్యేక పోలీసులు బలగాలు రంగంలోకి దిగాయి. నిందితుడు అనిల్ తన తల్లిని చంపి తన ఫోన్ అక్కడే పగులగొట్టి తన బట్టలు కూడా అక్కడే విడిచిపెట్టి బయటి ప్రాంతానికి వెళ్లి ఓరైతు నుంచి ఫోన్‌ను లాక్కొని వెళ్లాడు. తన తండ్రికి సమాచారం ఇచ్చి ఫోన్‌ను స్విచ్ఆఫ్ చేసి పొదలమాటున విసిరేసి అటవీ ప్రాంతంలోకి పారిపోయాడు. గాలింపు చర్యల్లో భాగంగా పోలీసులు ఫోన్‌ను సేకరించారు. నిందితుడు హైదరాబాద్ వైపు పారిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు.

సర్వే నిర్వహించలేం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో స్వచ్ఛసర్వేక్షణ్ సర్వే నిర్వహించలేమని అంగన్‌వాడీ టీచర్లు కమిషనర్ మహమూద్‌షేక్‌కు తెలియజేశారు. గురువారం సాయంత్రం కావేరమ్మపేట ఫంక్షన్‌హాల్ వద్ద సర్వేకు సంబంధించి అవగాహన కల్పిస్తామని హాజరుకావాలని కమిషనర్ సమాచారం అందించారు. కాగా టీచర్లు చేరుకున్నప్పటికీ కమిషనర్ ఆలస్యంగా రావటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము ఇప్పటికే బీఎల్ఓ విధులు నిర్వహిస్తున్నందున సర్వే చేయలేమని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సూచనల మేరకు తప్పనిసరిగా సర్వే చేయాలని చెప్పటంతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన చెప్పి పంపించారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ



రాజాపూర్: కుత్నేపల్లి బోడగుట్టతండా గ్రామ పంచాయతీ భవనానికి గురువారం ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి భూమిపూజ చేశారు. రూ. 20 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ సేవ్యానాయక్, నాయకులు రాజు, మోహన్‌దాస్, రూప్‌సింగ్, సుధాకర్, ధోలీబాయి పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్‌ల సేవలు ప్రశంసనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ, వనితా క్లబ్‌ల సేవలు ప్రశంసనీయమని ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ అన్నారు. క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు వలకొండ చంద్రశేఖర్, వనితా క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, కార్యదర్శి ఎదిరె రాధిక, కోశాధికారి గుబ్బ లావణ్య పాల్గొన్నారు.

సంపద వనాల పరిశీలన

మిడ్జిల్: వాడ్యాల్, వల్లభ్‌రావుపల్లి, వేముల గ్రామాల్లో చెరువు కట్టలపై నాటిన సంపద వనాలను గురువారం ఏపీడీ జాకియాసుల్తానా పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్ రవి, ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్ ఉన్నారు.

అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు



మూసాపేటలో నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్

అడ్డాకుల: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని సగర సంఘం భవనం వద్ద గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కని మారుతిసాగర్‌తో కలిసి సగర సంఘం భవన నిర్మాణానికి తన ఎమ్మెల్సీ నిధుల ద్వారా రూ.5లక్షలను కేటాయిస్తూ మంజూరు పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. బీళ్లుగా మారిన పాలమూరు నేలకు కల్వకుర్తి జలాలను తెచ్చి ఆదుకొంటున్నాడని కొనియాడారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 చెక్‌డ్యాంలను నిర్మించి కొత్తగా వేల ఎకరాలకు సాగునీరందించామన్నారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బీసం రాఘవులు, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మా, మాజీ ఎంపీటీసీ శెట్టిశేఖర్, కొండయ్య, డీఆర్.వెంకటేష్, రాంచంద్రయ్య, అంజనేయులు, కొండల్, గుంటి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

గొర్రెలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే..

భూత్పూర్: అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చెందిన 6 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్,రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జాకీర్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం..

మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన బోయ రామంచంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందగా గురువారం బాధితకుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆల పరామర్శించారు. అనంతరం అంత్యక్రియ ఖర్చుల కోసం రూ.10వేలు అందజేశారు.

పదోన్నతులు చేపట్టాలి: తపస్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపం వద్ద జిల్లాస్థాయిలో ధర్నా చేపట్టారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలని, సీపీఎస్ విధానం వల్ల చాలామంది ఉపాధ్యాయులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, వరప్రసాద్, రాజమోహన్, వెంకటేష్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరెకటికల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని ఆరెకటికలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆరెకటిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. పట్టణంలోని స్లటర్ హౌజ్ మటన్ మార్కెట్ ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. విజయ బ్యాంక్ లైన్ షాషాబ్‌గుట్ట రోడ్డు మార్గంలో ఉన్న మాంసం దుకాణాలు వెనుక ఉన్న ప్రహరీ గోడ జరపాలన్నారు. మాంసం విక్రయవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబాబు, ప్రధాన కార్యదర్శి రవీందర్, నరేష్, మక్బుల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచాలి

గండేడ్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుచేసుకోవడానికి గడువును పెంచాలని ఉమ్మడి గండీడ్ మండలం కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు నారాయణ, యూత్ అధ్యక్షుడు పవన్‌కుమార్, లీగల్ సెల్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, సల్కర్‌పేట్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, గండీడ్ మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ముకుందం, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి ఆరేందర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దేవరకద్ర: గూరకొండకి చెందిన దాసరి రవికుమార్ రెండునెలల క్రితం బైక్‌పై దేవరకద్రకు వస్తుండగా మార్గ మధ్యలో సెల్‌ఫోన్ ఎక్కడో పడిపోయింది. దేవరకద్రకు వచ్చాక చూసుకోగా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నూతన సాంకేతికత సాయంతో ఫోన్‌ను రికవరీ చేశారు. గురువారం బాధితుడికి ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో అప్పగించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

జడ్చర్ల టౌన్: మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయంలో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, కౌన్సిలర్ కుమ్మరి రాజు, నాయకులు నర్సింహులు, అనంతకిషన్ పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలో ఆర్మీ, పోలీసు శాఖల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులను బీజేపీ నాయకులు సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రవీందర్ ఉన్నారు.

'గ్రూప్-2'వాయిదా వేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టిన గ్రూప్-2 పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని లైబ్రరీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంట వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షుడు జాన్సన్ బాబు, భరత్ పాల్గొన్నారు.

వార్షికోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌యూటీఎఫ్ 50వ ఆవిర్భావ ఉత్సవాలను గురువారం జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్,రవికుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



నవాబుపేటలో దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

నవాబుపేట: కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యూలర్ చేసి వారి న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. తమను రెగ్యూలర్ చేయకుండా కొత్తగా పరీక్షలు రాయాలని చెప్పడం సరికాదన్నారు. 15 వరకు తమడిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. వైద్యాధికారులకు వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు వసుంధర, రామేశ్వరీ, పుష్ప, ఇందిరా, రాములమ్మ, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశవర్కర్లు గురువారం నిరసన చేపట్టారు. తమకు పనికి తగ్గ వేతనం అందించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిర్మల, అంజమ్మ, పద్మ, మాదవి,రామంజమ్మ, యాదమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సెకండ్ ఏఎన్ఎంలు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆస్పత్రి ఎదుట నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, మండల కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అర్చకులకు గుర్తింపు

భూత్పూర్: అర్చకులకు గుర్తింపు తెచ్చింది సీఎం కేసీఆర్ అని, నేడు రూ.10వేల వేతనం ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం భూత్పూర్‌లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ దూప, దీప నైవేద్య అర్చక సంఘం మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ, రాష్ట్ర డైరక్టర్ జోషి గోపాల్‌శర్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు పూలతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహలక్ష్మి ద్వారా అర్హులైన బ్రాహ్మణులకు సాయం అందిస్తామన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి ఎస్టీ పూజారులు రావడం సంతోషకరమన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, వైస్ఎంపీపీ నరేష్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, పాలమూరు బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు భీమా చార్యులు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర శర్మ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' కటాక్షం ఎవరికో?



జిల్లాకేంద్రంలో బారులుతీరిన దరఖాస్తుదారులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలకు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. చివరిరోజు కావడంతో ఆశావహులు బారులు తీరారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయానికి గురువారం 3,654 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా హన్వాడలో మొత్తం 5589, రాజాపూర్‌లో మొత్తం 2725, దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు సంబంధించి 3833, అడ్డాకులలో 1973, మూసాపేటలో 1543, మహబూబ్‌నగర్ రూరల్‌లో 4,438, చిన్నచింతకుంటలో 3,904, నవాబుపేటలో మొత్తం 5135 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వాసవీ మహిళా కన్వెన్షన్‌కు రూ.2 కోట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో వాసవీ మహిళా కన్వెన్షన్‌కు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రూ.2కోట్లు మంజూరు చేసినట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్ వెల్లడించారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాసవీ హాస్టల్‌లో మెస్‌కు సంబంధించి మంత్రికి విన్నవించగా రూ.25లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తామన్నారు. సంఘం కోశాధికారి నాగరాజు, వాసవీ విద్యార్థి వసతి గృహం అధ్యక్ష, కార్యదర్శులు కొండా చక్రధర్‌గుప్తా, ఎదిరె ప్రమోద్‌కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రధాన కార్యదర్శి భార్గవి, తేజశ్రీ, బాలకిష్టయ్య గుప్త, రేగూరి కృష్ణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి

దేవరకద్ర: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తి వేయాలని జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. మండలంలో గురువారం ఆశవర్కర్లు, కాంట్రాక్టు ఏఎన్ఎమ్‌లతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, న్యూడెమక్రసీ జిల్లా నాయకుడు సీహెచ్ రాంచందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. యూనియన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి పరశురాం, నాయకులు మున్నా, జంగయ్య, రాంచంద్రయ్య, కృష్ణయ్య, రాములమ్మ, కాశమ్మ, బాలమణి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజాపూర్ ఆదర్శం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

రాజాపూర్: అభివృద్ధిలో రాజాపూర్‌ను మిగతా గ్రామాల వారు ఆదర్శంగా తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజాపూర్‌లో 90 అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. అదికూడా నాణ్యతతో చేపట్టారని అన్నారు. ఈ మేరకు సర్పంచ్ కొప్పెరిబచ్చిరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో గ్రామానికి రూ. ఆరున్నర కోట్లు నిధులు కేటాయించారని సర్పంచ్ బచ్చిరెడ్డి అన్నారు. అందువల్లే అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. గృహలక్ష్మి పథకంలో తమ గ్రామానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, రాయపల్లి సర్పంచ్ గంగాధర్‌గౌడ్, నాయకులు నరహరి, సత్యయ్య, అచ్చయ్య, విజయ్, నర్సింహులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో తిర్మలగిరి, నందారం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.

జడ్చర్ల టౌన్: జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవాసహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదండాపూర్ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నిమ్మబావిగడ్డలో శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా ప్రభుత్వం కమిషన్ పెంచుతూ తీసుకున్న నిర్ణయంతోమండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డిని సన్మానించారు. సంఘం అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర నాయకుడు నాగరాజు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తిరుమల హిల్స్‌లో బీటీరోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని మూడో వార్డు పరిధిలోని తిరుమల హిల్స్ నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు రూ.1.77 కోట్లతో, వార్డు నం.2 పరిధిలోని చైతన్య సెంట్రల్ స్కూల్ రోడ్డు నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు రూ.74 లక్షలతో నిర్మించే బీటీరోడ్లు, సీసీ డ్రెయిన్లకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, ఎంఈయు.బస్వరాజ్, మెడికల్ కళాశాల డైరెక్టర్ డా.రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.రామకిషన్, కౌన్సిలర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

త్వరలో న్యాయవాదులకు ఇళ్ల కేటాయింపు..

పాలమూరు: జిల్లాలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ కృషి చేస్తామని, త్వరలో ఇళ్ల కేటాయింపులు చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవన్‌లో గురువారం న్యాయవాదులకు మంత్రి హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ భవన్ మరమ్మతుల కోసం రూ.20లక్షల కేటాయిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా దళిత బంధుకు అర్హులైన న్యాయవాదులు ఎవరైనా ఉంటే వారి జాబితాను దృష్టిలో పెట్టుకుని పథకాన్ని వర్తింప చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. అనంతరం మంత్రిని న్యాయవాదులు సన్మానించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, పీపీలు బెక్కెం జనార్దన్, సతీష్, వెంకటరాములు, పరంధాములుగౌడ్, చంద్రశేఖర్, మురళీకృష్ణ, రామనాథ్ గౌడ్, శ్రీరాంకుమార్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

దేవరకద్ర: మండల కేంద్రంలో గత నెల 18న డ్రంకెన్ డ్రైవ్‌లో బస్వాపూర్‌కు చెందిన రంజిత్‌గౌడ్ పట్టుబడ్డాడు. గురువారం అతడిని కోర్టులో హాజరుపరచగా రూ.2500 జరిమానాతో పాటు ఒకరోజు జైలు శిక్ష విధించారని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ఆపిల్‌పండ్ల లారీ బోల్తా

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులోని జాతీయ రహదారిపై ఆపిల్ పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడిన ఘటనలో అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితుల వివరాల ప్రకారం...తమిళనాడుకు చెందిన లారీలో హర్యానాలోని చండీఘడ్ నుంచి కోయంబత్తూర్‌కు ఆపిల్ పండ్లను తరలిస్తున్నారు. మార్గమధ్యలో బుధవారం అర్ధరాత్రి తర్వాత జానంపేట శివారులో లారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టు పక్కన బోల్తాపడింది. డ్రైవర్ ప్రసాద్, క్లీనర్ భారదిద స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లారీలో ఉన్న ఆపిల్ పండ్లు కిందపడిపోయాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

77మంది అనాథ చిన్నారుల గుర్తింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 49 వార్డుల్లో అనాథ చిన్నారులపై ఈ నెల 9 నుంచి మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, సీఓలు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది. కాగా, రెండు రోజుల్లోనే 77మంది అనాథ చిన్నారులను గుర్తించారు. ఈ మేరకు వీరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ముగిసిన శిక్షణ శిబిరం

జడ్చర్ల టౌన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాతబజార్‌లో నిర్వహించిన ఉచిత కుట్టుశిక్షణ శిబిరం ముగియటంతో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. 40మంది మహిళలకు దుర్గాబాయి మహిళా శిశు వికాస్ కేంద్రం డీఎం సరిత, వార్డు కౌన్సిలర్లు శ్రీశైలమ్మ, సుంకసారి రమేష్‌లు సర్టిఫికెట్లు అందజేసి శిక్షణ ద్వారా స్వయం ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. ట్రైనర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు మాణిక్యమ్మ, ఎల్లమ్మ, నాగమణి, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాత పెన్షన్ సాధన కోసం ప్రతి సీపీఎస్ ఉద్యోగి పోరాటం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. అందులో భాగంగా గురువారం జనరల్ ఆస్పత్రిలో ఈనెల 12వ తేదిన నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూపరింటెండెంట్ రాంకిషన్ మద్దతు తెలిపారు. చంద్రకాంత్, రఘువేందర్‌రెడ్డి, ఆర్ఎంఓ లక్ష్మణ్, సత్యనారాయణెడ్డి, మదుసుదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టి పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్‌లు డిమాండ్ చేశారు. ఈనెల 12న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నా వాల్‌పోస్టర్‌ను గురువారం మండలంలోని కోడూర్ గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు బి.నర్సప్ప, రాధమ్మ, సవిత, అరుణ, ముంతాజ్‌బేగం, రమేష్, శ్రీనివాస్, జగదీష్, శ్రీరాములు, గాయత్రి, నాగిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మిడ్జిల్ తహసీల్దార్‌గా రాజునాయక్

మిడ్జిల్: మండల తహసీల్దార్‌గా రాజునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వంగూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న రాజీవ్ రెడ్డి మహబూబ్‌నగర్‌కు వెళ్లారు.

నవాబుపేట: మండల తహసీల్దార్‌గా మల్లికార్జున్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండలంలో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేసిన రాజేందర్‌రెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖకు బదిలీ అయ్యారు.

రక్తదానం చేసిన మెడికోలు

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకుకు పాలమూరు మెడికల్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఆస్పత్రిలో గురువారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి 24మంది 24యూనిట్ల రక్తం అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ శిరీష, బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్స్ మధుసూదన్ రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉపాధ్యాయుడు సుదర్శన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ నర్సింహులు, ఉపసర్పంచ్ నర్సింహచారీ, హెచ్ఎం జగదీష్, సీఆర్పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా బిల్లులన్నీ చెల్లించాలి



జడ్చర్ల టౌన్: గత అక్టోబర్ నెల నుంచి పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్ జీపీఎఫ్ డబ్బులు, సరెండర్, పీఆర్సీ బకాయిలు ఈనెలాఖరులోగా చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బాదేపల్లి, కావేరమ్మపేట, హరిజనవాడ, ఉర్దూమీడియం జెడ్పీహైస్కూల్‌లను సందర్శించి పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదులు చేయించారు. బిల్లులు చెల్లించకపోతే నిరసన చేపడతామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, శివకుమార్, సాయిరాంరెడ్డి, గోపాల్, వెంకటయ్య, పాండురంగాచారీ పాల్గొన్నారు.